కథానిక

శ్రీ గుమ్మా ప్రసన్నకుమార్

# ఆశాలత

తలుపు చప్పుడయింది.

ఎస్.... కమింగ్ తలుపు తీసాడు ప్రభాకరం.

ఎదురుగా ఆశాలత !

లోపలికి వచ్చింది.

ఆయన లేరా ? పక్క మంచం కేసి చూస్తూ అడిగింది.

లేడు.... కూర్చోండి కుర్చీ చూపించేడు.

థాంక్స్ కూర్చుంటూ అంది ఇప్పుడు వచ్చేస్తారనుకుంటాను.

శంకరం బొంబాయి వెళ్ళిన సంగతి చెప్దామా వద్దా అని సంశయించేడు ప్రభాకరం. చెప్పకపోతే అతని కోసం. అతను వచ్చేవరకూ కూర్చునే టట్టుంది.

శంకరం బొంబాయి వెళ్ళేడు. చెప్పేశాను.

నిజంగానా ?

అవును. నిజానికి ఎవరితోనూ చెప్పొద్దని అన్నాడు. ఒక్క నిముషం ఆగి, ఆమె మొహంలోకి చూస్తు అన్నాడు. చివరికి మీతో కూడా.... కానీ, ఉండబట్టలేక చెప్పేశాను.

ఆశాలత ఒక్కసారి కళ్ళెత్తి ప్రభాకరం వంక చూసింది. తల వంచుకుని కుర్చీ చేతుల మీద పిచ్చిగీతలు గీస్తు కూర్చుంది

గదిని నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. కిటికీలో నుండి వచ్చే గాలికి ఆమె ముంగురులు వింతగా కదుల్తున్నాయి. జోరీగ లాగ రంపపు మిల్లునుండి వస్తున్న శబ్దం, బస్సుల, కార్ల రొదతో కలిసిపోయి కలగాపులగమవుతోంది. ఆకాశంలో రెండు గాలి పడగలు పట్టీలు లాటున్నాయి. ఒకటి తెగిపోయింది. ఎటో పోతోంది.

ఉన్నట్టుండి అంది ఆశాలత. చూశారా ! నేను ఆదివారం వస్తానని తెలిసీ వెళ్ళిపోయాడు. నిష్ఠూరం ధ్వనించింది ఆమె కంఠంలో.

ప్రభాకరానికి నవ్వు వచ్చింది. ఆపుకుంటూ అన్నాడు. చూడండి. అతనికి పనుండి బొంబాయి వెళ్ళేడేమో ! మీరు అనవసరంగా అపార్థం చేసుకుంటున్నారేమోనని అనిపిస్తోంది.

లేదు ప్రభాకరంగారూ, ఎన్ని పనులున్నా ఎంత అర్జంటుగా ఊరు వదలి వెళ్ళవలసి వచ్చినా నాకు చిన్న ఉత్తరం ఉంచకుండా వెళ్ళేవాడు కాదు. ఇప్పుడు........ ఇప్పుడు ఉత్తరం లేదు సరికదా, నాకు చెప్పొద్దని మీకు ఆదేశం ఇచ్చేడు.

మౌనంగా తలవంచుకున్నాడు ప్రభాకరం.

....మీకు తెలియదు ప్రభాకరంగారూ, నేను ఎంత దగ్గరగా వద్దామని ప్రయత్నిస్తు

న్నానో అతనంత దూరంగా పోతున్నాడు. నేనేం చేశానని? రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని నిశ్శబ్దంగా ఏడ్చింది.

ఆశాలత మీద చెప్పలేనంత జాలి కలిగింది ప్రభాకరానికి. ఆమెను ఎలాలనునయించాలో అతనికి తోచలేదు.

కొంతసేపటికి తనకు తనే తమాయించుకుని, తలెత్తి మెల్లగా అంది మీకు తెలుసనుకుంటాను మా పరిచయం ఎన్నాళ్ళదో క్రిందటి ఆదివారం రాలేకపోయాను. తీరికలేని పనులవల్ల ఈవారం వస్తానని తెలిసి వెళ్ళిపోయాడు.

అప్పటికీ ప్రభాకరానికి ఏం మాట్లాడాలో తోచలేదు.

పెళ్ళి విషయంలో నన్ను అన్యాయంచేస్తాడేమోనని అనుమానంగా ఉంది ప్రభాకరంగారూ! మళ్ళీ ఏడ్చింది

ప్రభాకరం ఉలిక్కిపడ్డాడు.

గాభరాగా అన్నాడు చూడండీ.... మీరు అనవసరంగా కంగారుపడుతున్నారు. శంకరం నా ఫ్రెండు. అతని గురించి నాకు తెలిసినట్లుగా మీకుకూడా తెలియదేమో! అయినా చెబుతున్నాను మీకు నా సహాయం ఎప్పుడూ ఉంటుంది. మీకాభయ మక్కరలేదు. నిశ్చింతగా ఉండండి. అభయమిచ్చాడు

ఆశాలత కళ్ళు తుడుచుకుంది.

కృతజ్ఞత పూర్వకంగా చేతులు జోడించింది

వెళ్ళొస్తానండీ. మరచిపోరు కదూ! మరో సారి జ్ఞాపకంచేసి వెళ్ళిపోయింది.

ఆరోజంతా ఆశాలతే ప్రభాకరం కళ్ళల్లో మెదిలింది. ఆమెకు చేతనైనంత సహాయం చేయాలని నిశ్చయించుకున్నాడు రాత్రి ఇద్దరికీ పెళ్ళి జరుగుతున్నట్లు కలవచ్చింది.

మర్నాడు ఆఫీసు నుండి బయటపడ్డ వెంటనే నేరుగా రూము చేరుకున్నాడు ప్రభాకరం. శంకరం నిద్రపోతున్నాడు.

శంకరం.... శంకరం... తట్టి లేపేడు.

ఏమిటీ? విసుగ్గా లేచేడు

నీతో కొంచెం మాట్లాడాలి. ముఖం కడుక్కో పద రెక్కపట్టుకుని లేవదీశాడు

ఐదునిముషాలలో వచ్చేస్తున్నాను బాత్ రూంలోకి పరుగెట్టేడు.

గదికి తాళంవేసి బయలుదేరారు.

దారిలో ఎవరూ మాట్లాడలేదు

ఈ మౌనం శంకరానికి విసుగు నిచ్చింది. అన్నాడు ఏమిటోయ్ పెద్ద ఏదో చెప్తానని ఎంతకూ చెప్పవేం?

ఇక్కడ కాదు. నేను చెప్పే వరకూ మాట్లాడకు

వింతగా చూశేడు శంకరం.

కాఫీ తాగి, కొద్ది దూరం నడిచి పార్కు చేరుకున్నాడు.

అతి కంఠం హాయిగా వినవస్తోంది మైక్ లోంచి. పార్కులో జనం చిక్కబడుతున్నారు జంట జంటలుగా వస్తోన్న జనంకేసి చూస్తు అన్నాడు ప్రభాకరం శంకరం....ఒక్కమాట అడుగుతాను చెప్తావా?

ఏమిటది? ఆశ్చర్యంగా అడిగేడు.

శంకరం కళ్ళల్లోకి సూటిగా చూస్తు అడిగేడు ప్రభాకరం నిన్ను నమ్ముకున్న ఆడదానిని నువ్వు మోసం చెయ్యవుకదూ!

ఎందుకు చెయ్యాలి?

నిన్న ఆశాలత రూముకొచ్చింది. అతనేం జవాబు చెప్తాడో అని కుతూహలంగా చూచేడు ప్రభాకరం

(తరువాయి 24వ పేజీలో)

## ఆశాలత
( 18వ పేజీ తరువాయి )

అహా మామూలుగా అన్నాడు శంకరం.

చూడు శంకరం........ ఆశాలత నిన్ను గాఢంగా ప్రేమిస్తోంది. అది నిజం శంకరం. నిన్ను నమ్ముకుంది. భవిష్యత్తుని ఎంతో ఉన్నతంగా ఊహించుకుంది. నీ నిర్లిప్తతను చూచి బెదిరిపోతోంది ఆమెకు అన్యాయం చెయ్యవు కదూ. బాధతో మెలికలు తిరిగాయి ఆ మాటలు.

ఒక్క నిముషం పాటు ప్రభాకరం వేపు వింతగా చూసి. పకాపకా నవ్వేశేడుశంకరం. లేచి. ప్రభాకరం చేతులు పట్టుకుని లేవదీస్తు అన్నాడు చాలా శ్రమపడి పోయావ్ కానీ లే ముందు భోదాం ఆకలేస్తోంది.

శంకరం రెండు చేతులూ పట్టుకుని వదల కుండా అన్నాడు ప్రభాకరం శంకరం ఇంత వరకూ నాకు దొరికిన స్నేహితులంతా మంచి వాళ్ళు. నీ చేతలతో మన స్నేహాన్ని పటిష్టం చెయ్యి. నా స్నేహితు లందరూ మంచి వాళ్ళన్న సంతృప్తిని నాకు మిగలనియ్యి శంకరం. ఏం? నా అభ్యర్థనని మన్నిస్తావ్ కదూ? కళ్ళంట నీళ్ళు తిరిగాయి ప్రభాకరానికి.

ప్రభూ. నీకేమీ తెలియదురా బాధగా అన్నాడు శంకరం.

అంతే నన్నమాట కోపం వచ్చేసింది ప్రభాకరానికి.

ఇప్పటికి ఇంతే.

ఒళ్ళు మండి పోయింది ప్రభాకరానికి, ఆ సమాధానంలో. తమాయించుకున్నాడు.

ఆ రాత్రి ఇద్దరూ భోజనం చేయలేదు.

ఒక ఆదకూతురుకి ఇచ్చిన మాటను నిల బెట్టలేకపోయాననే అసంతృప్తి ఒక ప్రక్క. ప్రపంచంలో తనొక్కడే మంచి స్నేహితుడు అని సగర్వంగా చెప్పుకున్న ఆ ఒక్కడూ తన మాటను నిర్లక్ష్యం చేయడంతో కోపం మరోప్రక్క శరీరాన్ని మనస్సునీ దహించే స్తున్నాయ్. కళ్ళు మూసుకొని పడుకున్నా ఆశాలత రూపం కళ్ళముందు నాట్యంచేస్తుంటే లేచి కూర్చున్నాడు ప్రభాకరం.

గాలిలో రెండు గంటలు తేలి ఆగి ఆగి విన వచ్చేయి నిశ్శబ్దంగా ఉన్న నిశరాత్రికి ఫాక్టరీ సైరన్లూ. గూర్ఖావాడి అరుపులూ. కుక్కల అరుపులూ భంగించేస్తున్నాయి.

ప్రభాకరానికి ఏదో ఆవేశం వచ్చింది. చీకట్లోనే తడుముకుంటూ శంకరం మంచం దగ్గరగా నడిచేడు

శంకరాన్ని లేపేడు.

ఊ ... ఏమిటి ప్రభూ.... ఏం జరిగింది? గాబరాగా లేచేడు. లైటు వెయ్యలేదే !

శంకరం రెండు చేతులూ పట్టుకుని అడిగేడు ప్రభాకరం నేనుచెప్పింది వినుశంకరం లతకు అన్యాయం చెయ్యకు. మన స్నేహాన్ని పవిత్రం చెయ్యి. ఏమంటావ్ శంకరం బుగ్గల మీదుగా రెండు కన్నీటి చుక్కలు రాలి పోయేయి.

నీకేమీ తెలియదంటాను ప్రభూ.

ఆ సమాధానంతో ప్రభాకరానికి ఒళ్ళు మండిపోయింది. నీకు తెలుసుకదూ ! ఇడియట్, కోపంతో అందినచోట ఒక్క దెబ్బ కొట్టి వదిలేశాడు ఛీ అంటూ.

శంకరం మాట్లాడలేదు.

ఇద్దరూ మాట్లాడుకోకుండానే పదిహేను రోజులు గడిచి పోయాయి.

ఒకరోజు ప్రభాకరం ఆఫీసునుండి వచ్చే సరికి తన మంచం మీద ఒక కాగితం ఉంది మడతపెట్టి.

గబగబా చదివేడు.

ప్రభూ !

నా జీవితంలో నే నెప్పుడూ ఎవరినీ వంచించడానికి ప్రయత్నించలేదు. అందుకు ప్రతిఫలంగా నేనే వంచింప బడుతానని అనుకోలేదు. నీ స్నేహితుడు నీకు అసంతృప్తిని కలుగజేసే పనులు చేయడని గుర్తుంచుకో.

నేను పుట్టినప్పుడే అమ్మ చనిపోయింది. నాన్న రెండో పెళ్ళి చేసుకుని నన్ను విస్మరించేడు. ప్రేమంటే ఏమిటో తెలియకుండా పెరిగేను. ఆశాలత నన్ను ప్రేమించిందను కున్నాను. మురిసిపోయాను. ఆ ప్రేమలో నా భాగం ఏదోవంతు అని తెలిసే సరికి నాకు వెర్రెత్తి నట్టుంది. నీకు తెలియదు. నేనామె మీద ఎంత ఆశ పెట్టుకున్నాను. నేను పోతున్నాను. ఎక్కడికి వెళతానో తెలీదు. కానీ. ఈ వూరు మాత్రం తిరిగిరాను.

శెలవ్.

నీ

శంకరం.

## గమనిక

కోర్టు ప్రకటనలు పంపువారు అక్షరములు విడివిడిగా వ్రాసి పంపగోర్తాము 1వ తేదీ పత్రికలో ప్రచురింప వలసిన ప్రకటనలను 25వ తేదీ లోగా. 15వ తేదీ పత్రికలో ప్రకటింప వలసిన ప్రకటనలు 10వ తేదీ లోగా పంపగోర్తాము.

—ఎడిటర్


## శుభవార్త

డాక్టర్లకు సాధ్యముగానివి వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. కుష్టు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము, సంతానము లేనివారుగూడ శ్రీయోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు

కావలసినవారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈచికిత్స వల్ల దేహములోవున్న వ్యాధులు తొలగిపోవుటయే గాక నూతన యౌవ్వనము కలుగును వివరములు కోరువారు పోష్టు ఖర్చులకు ఒకరూపాయి పంపవలయును.

అడ్రసు:

యోగాశ్రమము

P. O. పెదవాల్తేరు

విశాఖపట్టణము - 3